సాక్షి నల్లగొండ
సోమవారం ౹ 13 ౹ జనవరి ౹ 2025



జాతీయ గుర్తింపు!

నల్లగొండ జిల్లా చారల దోస(పిక్లింగ్ మిలన్)కు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కనుంది.

- 8లో



మారిన లైఫ్‌స్టైల్ !

నడిగూడెం మండలంలోని యువకులు ట్రేడింగ్ పేరిట రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు.

- 8లో



మధ్యాహ్నం సాధారణం

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఆదివారం మధ్యాహ్నం కాస్త తగ్గింది.

- 8లో

న్యూస్‌రీల్

బెల్లి యాదయ్యకు అలిశెట్టి పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న బెల్లి యాదయ్య

నకిరేకల్ : నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య అలిశెట్టి స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన అలిశెట్టి స్మారక రాష్ట్ర స్థాయి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో నల్లగొండకు చెందిన కవి చింతల యాదగిరి, కంబాలపల్లి కృష్ణ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

నల్లగొండ : డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు అల్మాస్ ఫహీమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డీస్ ఫౌండేషన్ గ్రూప్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో కంప్యూటర్ ఆపరేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైపింగ్, సెక్టార్ రెడీనెస్, ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై రెండు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి.. ఉద్యోగావకాశాలు కలిస్తామని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉన్న వారు అర్హులని.. 18 నుంచి 35 మధ్య వయస్సు ఉన్న వారు జనవరి 20లోగా దరఖాస్తులు చేసుకోవాని సూచించారు. వివరాలకు 70326 49925 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు

నల్లగొండ : సంక్రాంతి సందర్భంగా ఈ నెల 13న సోమవారం జరుగనున్న పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు చేస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు ఈ విషయం గమనించాలని పేర్కొన్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్: సాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు శని, ఆదివారాలతో పాటు వరుసగా సంక్రాంతి సెలవులు రావడంతో నాగార్జునసాగర్‌ను సందర్శించేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. లాంచీలలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడ మ్యూజియం సందర్శించారు. హిల్‌కాలనీలో బుద్ధవనం, పైలాన్ కాలనీలో విద్యుదుత్పాదన కేంద్రం, ఎత్తిపోతల, అనుపు ప్రాంతాలను సందర్శించారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం

కట్టంగూర్ : మండలంలోని చెర్వుఅన్నారంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కందాల రమ క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని రాష్ట్ర స్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎడ్ల పెదరాములు, చెవుగోని రవి, ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేష్ ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, ఉపాధ్యాయులు లింగయ్య, మాధురి, మధు, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కోదాడ: కోదాడలోని తేజ టాలెంట్ పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 12 జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పాలడుగు ఖ్యాతి తెలిపారు. బాలుర సీనియర్, జూనియర్ విభాగాల్లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన వారు, బాలికల విభాగంలో సూర్యాపేట జిల్లాకు చెందిన వారు, బాలికల జూనియర్ సింగిల్స్ విభాగంలో ఉత్తమ్ లిఫ్టర్‌గా ఖమ్మం జిల్లాకు చెందిన ఎతోనిశ్రీ, సీనియర్ సింగిల్స్ విభాగంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన సీహెచ్. అనూష ఉత్త్మ లిఫ్టర్‌గా నిలిచారు. బాలుర సింగిల్స్ జూనియర్ విభాగంలో ఖమ్మంకు చెందిన కె. అభిరామ్, సీనియర్ విభాగంలో కె. మోహన్ విజేతలుగా నిలిచారు.

భోగిభాగ్యాలు



పల్లెలు, పట్టణాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకొని సొమ్ము చేసుకునే పనిలో రైతులు.. వాకిళ్లలో కళ్లాపి చల్లి ముగ్గులు వేస్తూ యువతులు.. తీపి వంటకాల తయారీలో మహిళలు.. పతంగుల ఎగురవేతలో చిన్నారులు.. ఆటల పోటీల్లో యువకులు.. ఇలా ఎవరి పనుల్లో వారు తలమునకలయ్యారు. మరో పక్క బంధుమిత్రుల రాక.. కొత్త కోడళ్లు, అల్లుళ్ల సందడితో పండుగ కళ ఉట్టిపడుతోంది. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదారు కీర్తనలతో పల్లెలు ఊర్లన్నీ సందడిగా మారుతాయి. మూడు రోజుల పండుగలో భాగంగా సోమవారం భోగి సందర్భంగా భోగి మంటలు వేస్తారు. చిన్నారులకు భోగి పళ్లు పోస్తారు. ఆలయాల్లో గోదా రంగనాయకస్వామి కల్యాణం నిర్వహిస్తారు.



- మూడు రోజుల వేడుక సంక్రాంతికి పల్లెలన్నీ ముస్తాబు
- తొలి రోజు భోగి మంటలు, భోగి పండ్లు ప్రత్యేకం
- రంగవల్లులతో కళకళలాడనున్న ఇళ్లలోగిళ్లు
- హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో సందడిగా మారనున్న గ్రామాలు

సూర్యాపేటటౌన్, యాదగిరిగుట్ట : సంక్రాంతి వేడుకలు భోగి పండుగతో ప్రారంభమవుతాయి. సంక్రాంతి ముందురోజు వచ్చే ఈ పండుగ రోజు ఉదయాన్నే ఇంట్లోని లేదా ఊళ్లో ఉన్న పాత సమాన్లు, పాత వస్త్రాలు అంతా పోగేసి కాల్చివేసే ప్రక్రియను భోగి మంటలుగా పిలుస్తారు. హోమాగ్నికి ప్రతిరూప మైన ఈ భోగి మంటల అంతరార్థం ప్రజలంతా భోగభాగ్యాలతో విలసిల్లాలనే. హోమాగ్ని భస్మాన్ని ధరించినట్లే ఈ భోగి మంటల ద్వారా వచ్చిన బూడిదను పిల్లలు, పెద్దలు నుదుటన ధరిస్తారు. చలిని తరి మేయటం కూడా ఇందులోని భావం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం భోగి వేడుకలను ఘనంగా జరుపుకోనున్నారు.

ఆడవాళ్లు, పిల్లల వేడుక..

ఇది పూర్తిగా ఆడవాళ్లు, పిల్లల వేడుక. భోగి పండుగ రోజు మహిళలంతా కలిసి తమ పిల్లలను ఆసనంపై కూర్చోబెట్టి నెత్తిమీద భోగి పళ్లు పోస్తారు. తలపై రాగి నాణేన్ని ఉంచి నారాయణుని స్వరూపమైన రేగు (బద రీ) చెట్టు పళ్లను పోస్తూ వారు సకల సౌభాగ్యాలతో తుల తూగాలని దీవిస్తారు. ఇలా



పోస్తే నారాయణుడి దీవెనలు అందుతాయని భావిస్తారు. వేడుకలో భాగంగా పేరంటాలకు పసుపు, కుంకుమలు, చందనం అందించి.. శనగలు, పటికబెల్లం, నువ్వులు, బెల్లం కలిపి దంచిన చిమ్మిలి ఉండలు ఇస్తారు. ఈ అన్ని కార్యాల వల్ల గ్రహశాంతి కూడా కలుగుతుందని విశ్వసిస్తారు.

సూర్యుడి ఆశీస్సులు

రేగు పళ్లను బదరీ ఫలాలని అంటారు. శివుడిని ప్రసన్నం చేసుకోవడానికి నర, నారాయణులు బదరి కావనంలో తపస్సు చేస్తారు. వారి తలల మీద దేవతలు బదరీ ఫలాలను కురిపించారని పురాణాల్లో రాసి ఉంది. ఆ ఘటనకు ప్రతీకగా పిల్లలను నారాయణుడిగా భావించి భోగి పళ్లను పోస్తుంటారు. రేగు పళ్లు ఎరుపు రంగులో ఉంటాయి. వాటిని సూర్యుడికి ప్రతీకగా భావిస్తారు. సూర్య భగవానుడి ఆశీస్సులు కూడా లభిస్తాయని భోగి పళ్లను పోస్తుంటారు.

మోత్కూరులో బోనాలు ప్రత్యేకం

మోత్కూరు : సంక్రాంతి పండుగను మోత్కూరులో వినూత్నంగా జరుపుకుంటారు. భోగి రోజు గౌడ, ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి, గౌడ కులస్తులు కంఠ మహేశ్వర స్వామికి బోనాలు సమర్పిస్తారు. మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి ఆలయాల వద్ద ప్రదక్షిణలు చేసి దేవతలకు నైవేద్యం సమర్పిస్తారు. భోగికి ముందు రోజు పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద గణపతి పూజ, అభిషేకం, హోమాన్ని ముదిరాజ్ కులస్తులు నిర్వహిస్తారు. సంక్రాంతి రోజు గ్రామాన్ని వదిలి వన భోజనాలకు వెళ్లడం విశేషం. 17 ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతుంది. గౌడ కులస్తులు కంఠ మహేశ్వర స్వామికి రెండు దశాబ్దాలుగా భోగి రోజున బోనాలు నిర్వహిస్తున్నారు. బిక్కేరు వాగు వద్ద జామ చెట్ల బావి, అమ్మనబోలు రూట్‌లో ఉన్న కంఠమహేశ్వర స్వామి ఆలయాల వద్దకు గౌడ మహిళలు తీపి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. సంక్రాంతి రోజున వన మైసమ్మ, రేణుక ఎల్లమ్మ దేవతలకు మేకపోతులు, కోళ్లు బలి ఇస్తారు.



బోనాలు తీసుకెళుతున్న మహిళలు

అధికారులు ధర్మానికే తలవంచాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

- సంక్షేమ పథకాలకు అర్హులనే ఎంపిక చేయాలి
- ప్రజాప్రతినిధులు చెప్పినా వినొద్దు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- అనర్హులను గుర్తిస్తే సస్పెండ్ చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన మండలి చైర్మన్ గుత్తా, కలెక్టర్

నల్లగొండ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలు చేయబోయే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ వంటి పథకాలకు అర్హుల ఎంపికలో అధికారులు ధర్మానికే తలవంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి ఆయా సంక్షేమ పథకాలపై నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి కలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు పక్షపాతిగా వ్యవహరిస్తోందన్నారు. సంవత్సర కాలంలోనే రైతులకు రూ.40 వేల కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. రైతు భరోసా విషయంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు రికార్డుల ఆధారంగా అర్హులను గుర్తించాలన్నారు. అనర్హులను ఎంపిక చేస్తే ప్రభుత్వ ధనం వృథా కావడంతో పాటు ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. గుట్టలు, వ్యవసాయ యోగ్యంగా లేని భూములను విలేజీ మ్యాప్ ఆధారంగా గుర్తించి వాటిని జాబితా నుంచి తొలగించాలన్నారు. ఎంతటి వారు ఒత్తిడికి చేసినా.. చివరకు ప్రజాప్రతినిధులు చెప్పినా వినొద్దన్నారు. అధికారులు మంచిగా పనిచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. మంత్రి కోమటిరెడ్డి కేంద్రంతో కొట్లాడుతూ.. రోడ్ల కోసం నిధులు తెస్తున్నాడన్నారు. సమస్యలు చాలా ఉన్నాయని.. ప్రణాళికా బద్ధంగా పరిష్కరించుకుంటూ వస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు పట్టాలుగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

న్యాయంగా వ్యవహరించాలి..

సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో అనర్హులను గుర్తిస్తే సంబంధిత వ్యక్తులను సస్పెండ్ చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మంత్రిగా తాను చెప్పినా.. అధికారులు మాత్రం న్యాయంగా అర్హులైన వారినే ఎంపిక చేయాలన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో నల్లగొండ నియోజకవర్గానికి 797 డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇచ్చిందని, తాము సంవత్సరంలోనే 3500 ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ చాలా మందికి పాస్‌బుక్‌లు ఉన్నాయి కాని భూమి లేదని అలాంటి వారిని గుర్తించి రైతు భరోసా నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, శాసనసభ్యులు బాలునాయక్, పద్మావతిరెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, జైవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు, తేజస్‌నంద్‌లాల్ పవార్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ట్రాఫిక్ ఇబ్బందులు రానివ్వం

- ఐజీ సత్యనారాయణ

చిట్యాల : సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ హైవేపై ట్రాఫిక్ ఇబ్బందులు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఐజీ వి.సత్యనారాయణ తెలిపారు. చిట్యాలలో హైవేపై ట్రాఫిక్‌ను ఆదివారం ఆయన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పోలీస్ అధికారులతో మాట్లాడి ట్రాఫిక్ సమస్య రాకుండా తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్, సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, యాదాద్రి భువనగిరి జిల్లా డీసీపీ మల్లారెడ్డి పర్యవేక్షణలో 550 మంది కానిస్టేబుళ్లు, 30 మంది ఎస్‌ఐలు, 15 మంది సీఐలు, ఇద్దరు డీఎస్పీలతో 24 గంటలపాటు షిఫ్ట్ వారీగా విధులు కేటాయించామన్నారు. రోజూ ఈ హైవేపై సుమారుగా ఇరవై వేల వాహనాలు మాత్రమే వెళ్తుండగా.. సంక్రాంతి నేపథ్యంలో రోజూ లక్ష వాహనాలు ప్రయాణిస్తున్నాయన్నారు. పండగ అనంతరం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వచ్చే వాహనాల రద్దీ కి అనుగుణంగా తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి, చిట్యాల ఎస్‌ఐ ఎన్.ధర్మా తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల వద్ద హైవేపై ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఐజీ

రామగిరి (నల్లగొండ) : నల్లగొండలోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం త్రిదండి దేవానాథ జియర్‌స్వామి ఆధ్వర్యంలో ఎదుర్కోలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. ఎదుర్కోలు సందర్భంగా అమ్మవారి గుణగణాలను వర్ణించడం భక్తులను అలరించింది. కార్యక్రమంలో ప్రవచకులు జగన్నాథచార్యులు, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చైతన్య దంపతులు, చొక్కారపు మాధవి, ఎర్రమాద సుజాత, రాజేష్, ఈశ్వర్ రెడ్డి, శిరీష్, ఆలయ మాజీ చైర్మన్ చకిలం వేణుగోపాల్‌రావు, సంధ్యారాణి పాల్గొన్నారు.



రామగిరి రామాలయంలో ఎదుర్కోలు నిర్వహిస్తున్న భక్తులు

భువనగిరిలో హైటెన్షన్!

బీఆర్‌ఎస్ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ దాడికి నిరసనగా ధర్నాకు పిలుపు

- అనుమతించని పోలీసు శాఖ
- తెల్లవారుజాము నుంచే ఉమ్మడి జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల హౌస్ అరెస్ట్, పలువురిని పోలీసుస్టేషన్లకు తరలింపు
- పోలీసులతో భువనగిరి పట్టణం అష్టదిగ్బంధనం
- ప్రత్యేక బలగాలు, అశ్వదళాల మోహరింపు
- అడ్డంకులు ఛేదించుకుని ధర్నా చేసిన బీఆర్‌ఎస్



భువనగిరి శివారులో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



భువనగిరిలోని అంబేద్కర్ విగ్రహం చుట్టూ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు

సాక్షి యాదాద్రి : జిల్లా కేంద్రం భువనగిరిలో హైటెన్షన్ నెలకొంది. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంపై యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూ కార్యకర్తల దాడిని ఖండిస్తూ పార్టీ నాయకత్వం ఆదివారం భువనగిరిలో మహాధర్నాకు పిలుపునిచ్చింది. ధర్నా నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలువురు బీఆర్‌ఎస్ నేతలను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. మరికొందరిని ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు. పట్టణంలో అడుగడుగునా భారీగా పోలీసు బలగాలు మోహరించడంతో కర్ఫ్యూ వాతావరణం తలపించింది.

వేకువజామునుంచే అరెస్టులు

బీఆర్‌ఎస్ ధర్నాను అడ్డుకునేందుకు పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు.వేకువజాము నుంచే నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని భువనగిరిలో అరెస్ట్ చేసి రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు మరికొందరు నాయకులను సాయంత్రం వరకు అక్కడే ఉంచారు. అదే విధంగా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి క్యామ మల్లేష్‌ను హైదరాబాద్‌లో, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్‌ను ఉప్పల్‌లో, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డిని యాదగిరిగుట్టలో, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను నల్లగొండలో, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డిని సైతం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను భువనగిరి పట్టణ శివారులో అదుపులోకి తీసుకుని నార్కట్‌పల్లిలోని ఆయన నివాసానికి తరలించారు. వీరితో పాటు రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌ను రామన్నపేటలో అరెస్టు చేసి స్థానిక పోలీస్టు స్టేషన్‌కు తరలించగా ఆయన అక్కడే నిరసన వ్యక్తం చేశారు. అదే విధంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, రైతుబంధు మాజీ కోఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, నాయకులు గాదె నరేందర్ రెడ్డితో పాటు మరికొందరు నాయకులు, వందలాది మంది కార్యకర్తలను విడతల వారీగా అదుపులోకి తీసుకుని రాచకొండ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

పట్టణం.. అష్ట దిగ్బంధనం

భువనగిరిలోని వినాయక చౌరస్తాలో మహాధర్నాకు బీఆర్‌ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసు శాఖ ముందుస్తుగానే అప్రమత్తమైంది. అంబేద్కర్ విగ్రహం వద్ద చుట్టూ బారికేడ్లు, పట్టణంలోకి వచ్చే మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక బలగాలు, అశ్వదళాలను రప్పించారు. ట్రాఫిక్‌ను పూర్తిగా మళ్లించడంతో పాటు దుకాణాలను సైతం మూసివేయించారు. పట్టణంలో ఎక్కడ చూసినా పోలీసు బలగాలు మోహరించడంతో కర్ఫ్యూ వాతావరణం తలపించింది. డీసీపీ రాజేశ్‌చంద్ర పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

వేర్వేరు మార్గాల్లో భువనగిరికి చేరి..

పోలీసులు ధర్నాకు అనుమతి ఇవ్వకపోగా, ముందస్తు అరెస్టులకు దిగడంతో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు వ్యూహాత్మకంగా వినాయక చౌరస్తాకు చేరుకున్నారు. పైళ్ల శేఖర్‌రెడ్డి, కర్నెప్రభాకర్, కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కొలుపుల అమరేందర్‌తో పాటు మరికొందరు బైక్‌లు, ప్రైవేట్ వాహనాలు, కార్లలో వివిధ మార్గాల ద్వారా భువనగిరికి చేరుకుని ధర్నా దిగారు.



మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

పోటాపోటీ నినాదాలు

వివేకానందుని జయంతి సందర్భంగా భువనగిరిలోని జూనియర్ కళాశాల ఎదురుగా ఆయన విగ్రహానికి నివాళులర్పించేందుకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తన అనుచరులతో వచ్చారు. అదే సమయంలో పైళ్ల శేఖర్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, కంచర్ల రామకష్ణారెడ్డి, కొలుపుల అమరేందర్ మరికొందరు నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని ధర్నాకు దిగారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా నినాదాలు దిగడంతో తోపులాట చోటు చేసుకుంది. వెంటనే పోలీసులు అప్రమత్తమై బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొనడంతో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి కాలికి గాయమైంది. ఆ తరువాత ఎలిమినేటి సందీప్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో మరికొందరు నాయకులు వచ్చి ధర్నా చేస్తుండగా వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం వచ్చి మరికొందరు కార్యకర్తలను కూడా అరెస్టు చేసి పోలీసుస్టేషన్లకు తరలించారు. మరోవైపు రైతుబజార్ వద్ద మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ధర్నాకు దిగగా వారిని పోలీసులు అదుపుకోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



నల్ల కండువాలు కప్పుకుని ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, నాయకులు

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా.. మల్టీపర్పస్ కార్మికుడు మృతి

- మరొకరికి గాయాలు

వేములపల్లి(మాడ్గులపల్లి): గ్రామపంచాయతీ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో మల్టీపర్పస్ వర్కర్ మృతిచెందాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నగూడెంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన గంజి పాపయ్య(40), నామా ఆదామ్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో ఆదివారం తెల్లవారుజామున చిన్నగూడెం గ్రామంలో వాటర్ సప్లయ్ చేసి తిరిగి ఆగామోత్కూర్‌కు వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ట్రాక్టర్ నడుపుతున్న గంజి పాపయ్యతో పాటు పక్కనే కూర్చున్న ఆదామ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను పక్కకు తొలగించి పాపయ్య, ఆదామ్‌ను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పాపయ్య అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య స్రవంతి, ఒక కుమారుడు ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి మోదుగు నాగేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

సాగర్‌లో చదువుకున్న మందా జగన్నాథం


జగన్నాథం (ఫైల్)

నాగార్జునసాగర్: నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా ఇటిక్యాల మండలం కొండేరు గ్రామం. జగన్నాథం తండ్రి పెద్దపుల్లయ్య నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇక్కడకు వచ్చి పైలాన్‌కాలనీలోని మెకానిక్ విభాగంలో వాచ్‌మెన్‌గా పనిచేశారు. ఆయన తల్లి సవరమ్మ హిల్‌కాలనీలోని ప్రాజెక్టు హెల్త్ ఆఫీస్‌లో ఆయాగా పనిచేశారు. జగన్నాథం హిల్‌కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వతరగతి వరకు చదువుకున్నారు. చదువుకునే రోజుల్లో ప్రతిరోజు సాయంత్రం హిల్‌కాలనీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో టెన్నిస్‌బాల్ పికప్ బాయ్‌గా, పుస్తకాలు, దస్తులు కొనుక్కునేందుకు వేసవి సెలవుల్లో నాగార్జునసాగర్ డ్యాం చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో వాటర్ బాయ్‌గా పనిచేశారు. కొన్ని సార్లు వేసవి సెలవుల్లో రోజుకు 50 పైసలకు కూలీగా పనిచేశారు. తరగతి గదిలో హుషారుగా ఉండే ఆయన తరగతి గది మానిటర్‌గా నియమింపబడేవాడని అతడి సహచరులు తెలిపారు. వారు ఐదుగురు అన్నదమ్ములు కాగా.. ముగ్గురు నాగార్జునసాగర్‌లో, ఒకరు వారి స్వగ్రామంలో ఉన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని ఆదివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, నిత్య హోమం, మూలవిరాట్ స్వామికి పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణతంతు అనంతరం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ లాభాలతో మారిన లైఫ్‌స్టైల్

- కార్లు, ఖరీదైన బైక్‌లతో యువకుల హల్‌చల్
- ట్రేడింగ్ నేర్పడానికి శిక్షణ తరగతులు.. దానికి భారీగా ఫీజు వసూలు
- సైబర్ నేరగాళ్లకే టోకరా పెట్టిన పలువురు యువకులు



కోదాడ: 'వస్తువు కొనాలంటే డబ్బులు కావాలి.. గౌరవం కావాలంటే డబ్బులు ఒంటి మీద ఉండాలి' ఇది ఓ తెలుగు సినిమాలోని డైలాగ్. ఈ మాటనే ప్రస్తుతం కోదాడ నియోజకవర్గంలో ట్రేడింగ్‌లో లక్షలు సంపాదించిన యువకులు ఆచరించి చూపుతున్నారు. కోదాడ నియోజకవర్గం నడిగూడెం మండలంలోని వల్లాపురం, సిరిపురం, మునగాల మండలం ఆకుపాముల గ్రామాల్లో గడిచిన ఆరు నెలలుగా ట్రేడింగ్ పేరిట పలువురు యువకులు లక్షల్లో సంపాదిండంతో వారి జీవనశైలి మారిపోయింది. ఖరీదైన బైక్‌లు, లక్షల రూపాయల విలువైన సెల్‌ఫోన్లు, ఒంటి మీద బంగారు ఆభరణాలతో గ్రామాల్లో హల్‌చల్ చేయసాగారు. మరికొందరు కోదాడ, ఖమ్మం పట్టణాల్లో భవనాలను కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టగా.. ఇంకొందరు గ్రామంలో భూములు కొంటామని, ధర ఎంతైనా పర్వాలేదని ఆఫర్లు ఇవ్వడంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. వంద రూపాయలకు ఇబ్బంది పడ్డవారు అవసరమైతే లక్ష రూపాయలు అప్పుగా ఇస్తా తీసుకో అనే స్థాయికి వెళ్లారని ఈ మూడు గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

ట్రేడింగ్ నేర్పడానికి రూ.80వేల ఫీజు

వల్లాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు మొదట బినాన్స్ ఆన్‌లైన్ యాప్‌లో ట్రేడింగ్ చేయడం మొదలుపెట్టాడు. అతడు నాలుగైదు బ్యాంకులలో ఖాతాలు తెరిచి ట్రేడింగ్ యాప్ ద్వారా కమీషన్ పొందసాగాడు. ఇది లాభసాటిగా ఉండడంతో పాటు మరికొన్ని ఖాతాలను తెరిచి సైబర్ నేరగాళ్లకు అద్దెకు ఇచ్చి లక్షల రూపాయల లాభం పొందాడు. అతడి లైఫ్‌స్టైల్‌ను చూసిన గ్రామంలోని పలువురు యువకులు తమకు ట్రేడింగ్ నేర్పాలని కోరడంతో సదరు యువకుడు గ్రామంలో శిక్షణా తరగతులను ప్రారంభించాడు. దీని కోసం ప్రతిఒక్కరి నుంచి రూ.80వేలు ఫీజు రూపంలో వసూలు చేశాడు. అనంతరం గ్రామంలో మరికొందరు కూడా ట్రేడింగ్ నేర్పడం మొదలుపెట్టడంతో ప్రస్తుతం ఈ ఫీజు రూ.20వేలకు తగ్గించారని సమాచారం.

సైబర్ నేరగాళ్లకే టోకరా..

'జూదం ఎలా ఆడామన్నది ముఖ్యంకాదు.. ఎక్కడ ఆపామన్నదే ముఖ్యం' ఇది కూడా సినిమా డైలాగే. ట్రేడింగ్ కోసం పదుల సంఖ్యలో ఖాతాలను తెరిచిన కొందరు యువకులు ఈ ట్రేడింగ్ జూదాన్ని సరైన సమయంలో ఆపివేసి లాభాలతో బయటపడ్డారు. వీరు ముందుగా తమ ఖాతాల ఐడీని ఇతరులకు అద్దెకు ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో కొందరు సైబర్ నేరగాళ్ల యువకుల ట్రేడింగ్ ఐడీలను అద్దెకు తీసుకొని ట్రేడింగ్ చేసి, వచ్చిన సొమ్మును వారి ఖాతాల్లో జమ చేయసాగారు. కొద్ది గంటల తరువాత ఆ సొమ్మును ఇతర రూపాల్లోకి మార్చుకోవడానికి సైబర్ నేరగాళ్ల ప్రయత్నించే లోపు ఐడీ అద్దెకు ఇచ్చిన యువకులు పాస్‌వర్డ్ తమకు తెలుసు కాబట్టి వెంటనే ఆ ఖాతాల్లో సొమ్మును డ్రా చేసుకొని సదరు ఖాతాను మూసివేసేవారు. దీంతో సైబర్‌నేరగాళ్ల చేసేది ఏమీలేక మిన్నకుండిపోయేవారని సమాచారం. ఇలా కొందరు యువకులు ఒక్క రోజులో రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు డ్రా చేసుకున్నట్లు గ్రామస్తులు అంటున్నారు. ఆన్‌లైన్‌లో మార్చుకుంటే తెలుస్తుందని ఏటీఎం కార్డుల ద్వారా డబ్బులను డ్రా చేసుకొనేవారని సమాచారం. ఆకుపాముల, సిరిపురం, త్రిపురవరం, అనంతగిరి గ్రామాలలో ఉన్న జాతీయ బ్యాంకులతో పాటు కోదాడ పట్టణంలో ఉన్న ఓ ప్రైవేట్ బ్యాంక్ కూడా వీరికి ఖాతాలు ఇవ్వడం, వారు వెంటనే వాటిని మూసివేయడంతో అనుమానం వచ్చి ఈ మూడు గ్రామాలకు చెందిన వారికి ఎట్టి పరిస్థితుల్లో ఖాతాలు ఇవ్వబోమని ఆయా బ్యాంకులు తేల్చిచెప్పాయి.

సంక్రాంతి తర్వాత అవగాహన సదస్సులు

కోదాడ నియోజకవర్గ పరిధిలోని మూడు గ్రామాలలో యువకులు చేస్తున్న ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో మోసం దాగి ఉంది. ప్రాథమిక దశలో డబ్బులు వచ్చినా తర్వాత దీనిలో భారీగా మోసపోయే అవకాశం ఉంది. సంక్రాంతి తర్వాత ఈ మూడు గ్రామాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తాం. ఈజీ మనీ కోసం యువత తప్పుడు దారుల్లో వెళ్లొద్దు. తల్లిదండ్రులు కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దు.

– శ్రీనివాసరావు, సైబర్ క్రైం డీఎస్పీ

ఉదయం ఫుల్.. మధ్యాహ్నం సాధారణం



చౌటుప్పల్ బస్టాండ్ ముందు రోడ్డు క్రాస్ చేస్తుండడంతో హైవేపై నిలిచిపోయిన వాహనాలు

- హైవేలపై కొనసాగిన సంక్రాంతి రద్దీ
- చౌటుప్పల్ జంక్షన్ వద్ద ట్రాఫిక్‌జామ్

చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్, కొర్లపహాడ్: సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఆదివారం కూడా కొనసాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ మినహా మిగతా అన్ని చోట్ల వాహనాలు సాఫీగా వెళ్లిపోయాయి. ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథ కుమార్ ట్రాఫిక్‌జామ్ కాకుండా పర్యవేక్షించారు. అదేవిధంగా చౌటుప్పల్ మండలం మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద తెల్లవారుజామున ట్రాఫిక్ జామ్ అయ్యింది. తర్వాత వాహనాల రద్దీ సాధారణ స్థితికి చేరింది. ఇబ్బందులు తలెత్తకుండా టోల్‌ప్లాజా నిర్వాహకులు, హైవే, పోలీస్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఉదయం సమయంలో వాహనాల రద్దీ నెలకొంది. శాలిగౌరారం రూరల్ సీఐ కొండల్‌రెడ్డి, కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ సిబ్బందితో కలసి టోల్‌ప్లాజా వద్దనే మకాం వేసి వాహనదారులకు సూచనలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కాకుండా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం తర్వాత హైవేపై వాహనాల రద్దీ తగ్గింది.

గూడూరు టోల్‌ప్లాజా వద్ద..

బీబీనగర్: వరంగల్–హైదరాబాద్ హైవేపై బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ ఏర్పడింది. పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారితో పాటు యాదగిరిగుట్ట, స్వర్ణగిరి క్షేత్రాలకు భక్తులు తరలిరావడంతో ట్రాఫిక్ నెలకొంది.

గో క్షేత్రంలో శతచండీ యాగం

- పాల్గొన్న సీఎస్ శాంతికుమారి


యాగంలో పాల్గొన్న సీఎస్ శాంతికుమారి

ఆలేరురూరల్: మండలంలోని కొలనపాకలో గల శ్రీమాతా పిత్ర గో క్షేత్రంలో ఆదివారం శతచండీ యాగం నిర్వహించారు. ఈ యాగంలో తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి పాల్గొన్నారు. వేదపండితులు మధ్య స్థాపిత దేవతా ఆరాధనలు, చండీపారాయణం, సుదర్శనం, హవనములు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శతచండీ హోమంలో భాగంగా సుదర్శన హోమం, లక్ష్మీనరసింహ హోమం చేశారు. కార్యక్రమంలో బంధు మాధవశర్మ, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఐఏఎస్ వెంకటరామిరెడ్డి, బాసంపల్లి సంతోష్‌కుమార్‌శర్మ, ప్రవాస భారతీయులు రవి, నాగమల్లిక, వేద పండితులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు కుటుంబం చెంతకు..


తండ్రి, బాబాయ్‌తో నాని

యాదగిరిగుట్ట: నెల క్రితం తప్పిపోయిన బాలుడు కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన రాములు, రేణుక దంపతుల కుమారుడు నాని తిప్పర్తిలోని ఎస్సీ రెసిడెన్షియల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. గతేడాది డిసెంబర్ 6వ తేదీన నాని ఎవరికీ చెప్పకుండా పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. అదే సమయంలో మెదక్ జిల్లా గజ్వేల్‌కు చెందిన గణేష్, రేణుక దంపతులకు తారసపడ్డారు. దీంతో నానిని గణేష్, రేణుక దంపతులు వారి వెంట తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి తిరిగి యాదగిరిగుట్టకు వచ్చారు. యాదగిరిగుట్టలో గణేష్, రేణుక దంపతులతో కలిసి నాని ఇక్కడే సుమారు 32 రోజుల నుంచి యాదగిరి క్షేత్రంలోని లక్ష్మీ పుష్కరిణిలో స్నానం చేస్తూ, అన్నదాన సత్రంలో భోజనం చేస్తూ, డార్మిటరీ హాల్‌లో నిద్రిస్తున్నాడు. గణేష్, రేణుక దంపతులపై అనుమానం వచ్చిన నాని పట్టణంలోని బీసీ కాలనీలో ఓ ఇంటి వద్దకు వెళ్లి తన తల్లికి కాల్ చేశాడు. దీంతో నాని తండ్రి రాములుతో పాటు ఆయన తమ్ముడు తిప్పర్తి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్‌తో కలిసి ఆదివారం యాదగిరిగుట్టకు వచ్చారు. పోలీసులు నానిని గుర్తించి అతడి తండ్రికి అప్పగించారు. గణేష్, రేణుక దంపతులు అనుమానాస్పదంగా ఉండటంతో వారి వివరాలు సేకరించి, చర్యలు తీసుకుంటామని స్థానిక పోలీసులు చెబుతున్నారు.

జిట్టా బాలకృష్ణారెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి


జిట్టా బాలకృష్ణారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం

భువనగిరి: తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రైతు బజార్ పక్కన ఏర్పాటుచేసిన జిట్టా బాలకృష్ణారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్సీ కోదండరాంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామగ్రామాన వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసిన ఘనత జిట్టా బాలకృష్ణారెడ్డికే దక్కుతుందన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలను, వంటకాలను తెలంగాణ ప్రజలతో పాటు ఢిల్లీలో తెలిసేలా చేశారన్నారు. భువనగిరి ఖిలాపై మొట్టమొదటిసారిగా లైటింగ్ ఏర్పాటు చేసిన ఖ్యాతి ఆయనకే దక్కిందన్నారు. భువనగిరిలో 2004లోనే బంధువుల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించారని అన్నారు. జిట్టా కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో జిట్టా బాలకృష్ణారెడ్డి చేసిన కృషి ఎప్పటికీ మర్చిలేనిదన్నారు. అంతకుముందు గాయకుడు ఏపూరి సోమన్న పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, తెలంగాణ ఉద్యమ నాయకుడు చెరుకు సుధాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవెస్ చిస్తీ, జిట్టా బాలకృష్ణారెడ్డి సతీమణి సునీత, నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, బర్రె జహంగీర్, గోమారి సుధాకర్‌రెడ్డి, సత్తిరెడ్డి, యాట సంతోష్‌రెడ్డి, శీలం శ్రీకాంత్, దాసరి శ్రీనివాస్, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

మన 'దోస'కు జాతీయ గుర్తింపు!

- జియో ట్యాగింగ్ కోసం ప్రతిపాదన


చారల దోస

గుర్రంపోడు: జాతీయ స్థాయిలో నిర్దిష్ట ప్రాంత మూలాలు ఉన్న పంటలకు ఇచ్చే భౌగోళిక గుర్తింపులో నల్లగొండ జిల్లా నుంచి చారల దోస(పిక్లింగ్ మిలన్)కు చోటు దక్కనుంది. తెలంగాణ రాష్ట్రం నుంచి హస్తకళలు, ఉద్యానవన పంటలకు సంబంధించి పది వెరైటీలకు మూలాల సేకరణతో జియో ట్యాగింగ్‌కు కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించనున్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కొండా లక్ష్మణ్ ఉద్యానవన పరిశోధనా కేంద్రం నల్లగొండ జిల్లాలో చారల దోస (పిక్లింగ్ మిలన్), వరంగల్‌లో కారం తక్కువగా ఉండి పచ్చళ్లకు వాడే చపాటా చిల్లీ (వరంగటి మిర్చి) రకం, హైదరాబాద్ చుట్టుపక్కల నిజాం కాలం నుంచి పండించే లావు సైజు గింజలు గల అనాప్‌సాహి ద్రాక్ష రకం, రంగారెడ్డి జిల్లా బాలానగర్ గ్రామంలో పూర్వకాలపు పంట బాలానగర్ సీతాఫలం జియో ట్యాగింగ్‌కు ఎంపిక చేసి రిజిస్ట్రేషన్ చేశారు. నల్లగొండ జిల్లాలో మూలాలు గల చారలు గల పొట్టి రకం దోసకాయ మేలురకంగా గుర్తించి వాటి మూలాలను అన్వేషిస్తున్నారు.

పంటలపై రైతులకే పేటెంట్..

నల్లగొండ దోసగా నామకరణం చేసిన దోస విత్తనాల విక్రయాలపై రైతులకే పేటెంట్ ఉంటుంది. ప్రైవేట్ కంపెనీలు కూడా ఈ రకం విత్తనాలు తయారు చేయలేవు. నల్లగొండ జిల్లాలో దోసను ఎక్కువగా సాగు చేస్తున్న ఏడు మండలాల రైతులకు పేటెంట్ దక్కనుంది. నకిరేకల్ ఫార్మర్స్ అసోసియేషన్ చిరునామాగా జియో ట్యాగింగ్ చేయనున్నారు. నల్లగొండ జిల్లా చందంపేటలో పోలెపల్లిలో కుంకుడు సాగు చేస్తున్న లోకసాని పద్మారెడ్డి అనే రైతు పేరున ఎల్‌పీఆర్–1 నామకరణం చేసి జియో ట్యాగింగ్‌కు రిజిస్టర్ చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

జియో ట్యాగింగ్‌కు సమర్పించాం

తెలంగాణ రాష్ట్రం నుంచి జియో ట్యాగింగ్‌కు రిజిష్టర్ చేయబడిన నాలుగు పంటల్లో వరంగల్ చపాటా చిల్లీ, రంగారెడ్డి జిల్లా ప్రాంత బాలానగర్ సీతాఫలం జియో ట్యాగింగ్‌కు ఆ పంటల మూలాల ఆధారాలతో ప్రతిపాదనలు పంపించాం. నల్లగొండ జిల్లా నుంచి దోస, హైదరాబాద్ ప్రాంత అనాప్‌సాహి ద్రాక్షాలకు సంబంధించి జియో ట్యాగింగ్‌లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. జియో ట్యాగింగ్ ద్వారా ఆయా పంటల మూలాలు గల ప్రాంతాలుగా వాటికి గుర్తింపు లభిస్తుంది.

– డాక్టర్ రాజిరెడ్డి, వైస్ ఛాన్స్‌లర్, కొండా లక్ష్మణ్ ఉద్యానవన పరిశోధనా కేంద్రం

హస్తకళల్లోనూ నల్లగొండ నుంచి బంజారా చేతి కుట్టు, బంజారా నగలు

తెలంగాణ రాష్ట్రం నుంచి హస్త కళల విభాగంలో నల్లగొండ జిల్లా బంజారా దుస్తుల కుట్టు, బంజారా నగలు, హైదరాబాద్ పెరల్స్(ముత్యాలు), నారాయణపేట నగలు, మెదక్ బటిక్ పెయింటింగ్‌కు జియో ట్యాగింగ్‌కు స్థానం లభించింది. వీటిని రిజిస్ట్రేషన్ పూర్తిచేసి ఫైలింగ్ చేసి 2025 సంవత్సరానికిగాను జియో ట్యాగింగ్ చేయబడినవిగా గుర్తింపు లభిస్తుంది.

ఇందిరమ్మ రాజ్యమంటే నిర్బంధాలేనా..

- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి


హౌజ్ అరెస్టు చేయడంతో ఇంట్లో న్యూస్‌పేపర్ చదువుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: ఇందిరమ్మ రాజ్యం అంటే అక్రమ అరెస్టులు, నిర్బంధాలేనా అని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు చేసిన దాడిని నిరసిస్తూ ఆదివారం భువనగిరిలో చేపట్టిన ధర్నాకు వెళ్లకుండా గొంగిడి మహేందర్‌రెడ్డిని యాదగిరిగుట్ట పట్టణంలోని ఆయన నివాసంలో పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ఎలాంటి అరాచకాలు, దాడులు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రతిపక్షాలు, ప్రజలపై దాడులు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో పోలీసులు పనిచేస్తూ, కాంగ్రెస్ కార్యకర్తలకు కవచంగా నిలిచి ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసినప్పటికీ ఇప్పటి వరకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులను అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. లేదంటే బీఆర్ఎస్ సైతం ప్రతి దాడులు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణను సాధించిన కేసీఆర్ ఉద్యమ సమయంలో, పదేళ్ల పాలనలో ఏనాడు విధ్వంసాలు చేయాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు చెప్పలేదని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తున్నారన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకొని దాడులు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ యువ నాయకుడు కల్వకొలను సతీష్‌రాజ్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేల హౌజ్ అరెస్ట్


నల్లగొండ టూటౌన్: హౌజ్ అరెస్ట్‌లో ఉన్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

రామన్నపేట, నల్లగొండ టూటౌన్: భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడికి నిరసనగా ఆదివారం నిర్వహించ తలపెట్టిన ధర్నాలో పాల్గొనేందుకు బయల్దేరిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను భువనగిరి పట్టణ శివారులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నార్కట్‌పల్లిలోని ఆయన నివాసానికి తరలించి సాయంత్రం వరకు హౌజ్ అరెస్టు చేశారు. ఉదయం 8గంటలకు నార్కట్‌పల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరిన చిరుమర్తి లింగయ్య అమ్మనబోలు మీదుగా రామన్నపేటకు చేరుకుని అక్కడి భువనగిరి పట్టణ శివారుకు చేరుకోగా.. ఆయనను టీచర్స్ కాలనీ సమీపంలో భువనగిరి రూరల్ సీఐ అదుపులోకి తీసుకుని నార్కట్‌పల్లికి తరలించి హౌజ్ అరెస్టు చేశారు. అదేవిధంగా నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో పాటు నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డిని పోలీసులు హౌజ్ అరెస్ట్‌లోనే ఉంచారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో పార్టీ కార్యాలయాలు దేవాలయాలతో సమానమని, అలాంటి వాటిపై కాంగ్రెస్ గూండాలు దాడులు చేయడం దుర్మార్గమన్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్


రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న బడుగుల, బీఆర్ఎస్ నాయకులు

రామన్నపేట: భువనగిరిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ డిమాండ్ చేశారు. భువనగిరిలో జరిగే ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయనను ఆదివారం రామన్నపేటలో పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులతో కలిసి ఆయన పోలీస్ స్టేషన్ ఆవరణలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. దాడులు, కేసులకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడరని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు తన పార్టీ శ్రేణులను, పోలీసులను దాడులకు ఉసి గొల్పుతున్నాడని ఆరోపించారు. ఆయన వెంట పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోచబోయిన మల్లేశం, బద్దుల రమేష్, ఎండీ ఆమేర్, బత్తుల వెంకటేశం, ఆవుల శ్రీధర్, ఆవుల నరేందర్, మోటె నరేష్, నల్ల సైదులు, రెముడాల వెంకన్న, కొండగడప చింటు, మేడబోయిన నరేష్ ఉన్నారు.

అక్రమ అరెస్ట్‌లు అప్రజాస్వామికం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నాగార్జునసాగర్: పోలీసులను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలోని ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం నాగార్జునసాగర్‌లోని విజయవిహార్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని నిరసిస్తూ, ధర్నాకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలమైందన్నారు. అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీకాదన్నారు. ప్రభుత్వ ఇదే రీతిలో కక్షసాధింపులకు దిగితే ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో నందికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రమేష్‌జీ, చంద్రమౌళి, హలీం, మక్సూద్, షరీఫ్, నకిరేకంటి సైదులు, ముత్తయ్య, హాజీ, హజర్, శేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వైఫల్యంతోనే దాడి

- బీఆర్ఎస్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: భువనగిరిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడి పూర్తిగా పోలీసుల వైఫల్యమేనని ఆ పార్టీ నాయకుడు చింతలవెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఆది వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసుల నిర్లక్ష్యం వల్ల లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందన్నారు. ప్రశాంతంగా ఉన్న భువనగిరిలో అలజడులు సృష్టించారని విమర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి తన స్థాయిని మరిచి సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. స్థాయిని మరిచి అడ్డగోలుగా మాట్లాడితే యూత్ కాంగ్రెస్ నాయకులు చూస్తూ ఊరుకోరన్నారు. ఎమ్మెల్యేగా ఓడిపోగానే పైళ్ల శేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైతే తానే అడ్డుకున్నానని అన్నారు. భువనగిరిలో నయీం ఆగడాలు బీఆర్ఎస్ పాలనలోనే జరిగాయన్నారు. బీఆర్ఎస్ పార్టీలోనే నయీం అనుచరులు చాలామంది ప్రజాప్రతినిధులుగా, పార్టీ పదవులు అనుభవిస్తున్నారన్నారు. భువనగిరిలో చిన్న కబ్జా జరిగినా ఊరుకునేది లేదన్నారు. సింగిల్ విండో మెంబర్‌గా గెలువలేని 70 సంవత్సరాలు నిండిన వ్యక్తి సీఎం రేవంతర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. యువజన కాంగ్రెస్ నాయకులు గూండాలు అని మాజీ ఎమ్మెల్యే సంబోధించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. సీఎంపై ఆరోణలు చేసిన వారితో పాటు పోలీస్ స్టేషన్‌లో ధర్నా చేసి, ఫ్లెక్సీలు దహనం చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్, నాయకులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పోత్నక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, కూర వెంకటేష్, అవైస్ చిస్తీ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి